సాక్షి అనంతపురం

మంగళవారం । 2 । మే । 2023



చీనీ టన్ను రూ.34 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34 వేలు పలికాయి.



గుడ్లురిమి.. ఆగడాలు 'జేసీ'

తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఉద్యోగులను తన గుప్పిట్లో ఉంచుకునేందుకు ఆగడాలకు పాల్పడుతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
37.8°/22.3°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పటిష్టం



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

రాయదుర్గం: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ దగ్గరపడుతున్న నేపథ్యంలో జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింత పటిష్టం చేసినట్లు ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం రాత్రి రాయదుర్గం అర్బన్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు తనిఖీ చేసి కేసుల పురోగతిపై సీఐ యుగంధర్‌తో ఆరా తీశారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో 12 చెక్‌పోస్టులు పెట్టి 24 గంటల పాటు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. కరెన్సీ, మద్యం, మారణాయుధాలు, పేలుడు పదార్థాలు తరలకుండా పహారా పెంచామన్నారు. మట్కా, ఐపీఎల్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై ఉక్కుపాదం మోపేలా చర్యలు చేపట్టామన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో బెట్టింగ్‌రాయుళ్ల ఆట కట్టిస్తామన్నారు. అసాంఘిక శక్తుల ఏరివేతలో వెనక్కు తగ్గేది లేదన్నారు. అర్బన్ పీఎస్‌కు త్వరలో సీఐని నియమిస్తామని ఎస్పీ చెప్పారు. ఎస్‌ఐ, ఏఎస్‌ఐల మధ్య ఓ కేసు విషయంలో జరిగిన వార్‌పై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విలేకరులు తెలపగా.. త్వరలో డీఎస్పీతో విచారణ చేయిస్తామన్నారు. అనంతరం డీ హీరేహాళ్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ బి.శ్రీనివాసులు, రాయదుర్గం, డీ హీరేహాళ్ ఎస్‌ఐలు సుమన్, రామకృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'పై ప్రత్యేక దృష్టి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



అనంతపురం అర్బన్: త్వరలో ప్రారంభం కానున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ గౌతమి జిల్లా అధికారులను ఆదేశించారు. వివిధ అంశాలపై కలెక్టర్ సోమవారం రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలపై తీసుకున్న చర్యలకు సంబంధించి నివేదికను సీపీఓకు పంపించాలని ఆదేశించారు. భూ వివాదాలు, సర్వే సమస్యలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 'మనబడి నాడు–నేడు' కింద చేపట్టిన పనులు జూన్ రెండోవారంలోగా పూర్తి చేయాలన్నారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టం అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అధికారులు ఎవరైనా సెలవు అవసరమైతే 24 గంటల ముందే సంబంధిత దరఖాస్తు పంపించాలన్నారు. సెలవులో ఉన్నా ఫోన్‌కు అందుబాటులో ఉండాలన్నారు. జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు ఆర్డీఓలు, జెడ్పీ సీఈఓ, డీపీఓ, మునిసిపల్, ఆర్‌అండ్‌బీ, పీఆర్, డ్వామా, డీఆర్‌డీఏ, మెప్మా, ఆర్టీసీ, డీటీసీ, జిల్లా, మండలస్థాయి అధికారులు, డీఐజీ, ఎస్పీ, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఇటీవల సీఎం పర్యటన విజయవంతం చేశారని ఈ సందర్భంగా అభినందించారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులోనూ ప్రదర్శించాలని ఆకాంక్షించారు.

పిడుగుపాటుకు 20 జీవాల మృతి



మృతి చెందిన గొర్రెలను చూపుతున్న రైతు

బొమ్మనహాళ్: పిడుగుపాటుకు గురై 20 మేకలు, గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం ఏళంజి పంచాయతీ పరిధిలోని వడ్డే కొత్తూరు గ్రామానికి చెందిన రైతు లింగప్ప వ్యవసాయంతో పాటు గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గొర్రెల పాకకు సమీపంలో పిడుగు పడింది. ఆ శబ్దానికి 16 గొర్రెలు, 4 మేకలు మృతిచెందాయి. దీంతో రూ. లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. కాగా, సమాచారం అందుకున్న బొమ్మనహాళ్ పశువైద్యాధికారి డాక్టర్ వెంకటరెడ్డి.. సోమవారం ఉదయం వడ్డేకొత్తూరుకు చేరుకుని మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

ఎరువుల ప్రణాళిక సిద్ధం



ఆర్‌బీకేలో నిల్వ ఉంచిన ఎరువులు

జగన్ ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోంది. వ్యవసాయానికి ఇతోధిక సాయం అందిస్తోంది. విత్తనం మొదలు పంట ఉత్పత్తుల విక్రయం వరకు తోడుగా ఉంటోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఆయా కంపెనీల నుంచి కోటా మేరకు ఎరువులను తెప్పిస్తోంది.



- ఖరీఫ్‌కు 1.10 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం
- రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల నిల్వ

అనంతపురం అగ్రికల్చర్ : ఖరీఫ్–2023కు వ్యవసాయశాఖ ఎరువుల ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రణాళిక అమలుకు కమిషనరేట్ నుంచి అనుమతులు కూడా జారీ అయ్యాయి. ఈ నెలలో వర్షాలు కురుస్తున్నందున సేద్యానికి రైతులు రంగంలోకి దిగనున్న నేపథ్యంలో ముందస్తుగానే ఎరువుల సరఫరాకు చర్యలు చేపట్టారు. నెలవారీ కోటా ప్రకారం వివిధ కంపెనీల నుంచి వివిధ రకాల ఎరువులు తెప్పించడానికి త్వరలోనే కంపెనీ ప్రతినిధులతో వ్యవసాయశాఖ జిల్లా అధికారి (డీఏఓ) చంద్రానాయక్ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేయనున్నారు. ప్రధానంగా ఈ ఖరీఫ్‌లో సాధ్యమైనంత ఎక్కువగా అంటే కనీసం 30 వేల మెట్రిక్ టన్నులు రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే)లో ఎరువులు నిల్వ చేసి గ్రామస్థాయిలోనే రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్లాన్ చేశారు.

1.10 లక్షల మెట్రిక్ టన్నులకు అనుమతి

ఖరీఫ్‌లో పెద్ద ఎత్తున పంటలు సాగులోకి రానుండటంతో అందుకు తగినట్లు 1.10 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపగా అందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. అందులో అత్యధికంగా 38,690 మెట్రిక్ టన్నులు కాంప్లెక్స్ ఎరువులు కేటాయించగా, ఆ తర్వాత యూరియా 36,600 మెట్రిక్ టన్నులు, 16,254 మెట్రిక్ టన్నుల డీఏపీ, 9,324 మెట్రిక్ టన్నుల సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్ (ఎస్ఎస్‌పీ), 8,370 మెట్రిక్ టన్నుల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంఓపీ), అలాగే 330 మెట్రిక్ టన్నుల కాంపోస్ట్ ఎరువులు కేటాయించారు.


ఖరీఫ్–2023లో నెలవారీగా ఎరువుల సరఫరాకు ప్రణాళిక (మెట్రిక్ టన్నుల్లో..)

నెల	యూరియా	డీఏపీ	ఎంఓపీ	కాంప్లెక్స్	ఎస్ఎస్‌పీ	కంపోస్టు	మొత్తం
ఏప్రిల్	1,315	4,200	--	6,925	719	58	14,252
మే	1,520	1,254	450	2,050	600	105	5,979
జూన్	4,150	1,270	1,050	3,815	2,100	30	12,415
జూలై	7,850	2,630	1,850	6,100	2,560	41	21,031
ఆగస్టు	11,200	3,650	2,460	9,650	1,130	50	28,140
సెప్టెంబర్	10,530	3,250	2,560	10,150	2,215	46	28,751

భూమి దుక్కులు చేసే స్థాయి నుంచి విత్తడం, కలుపు తీత, అంతర్‌కృషి, పంట ఎదుగుదల, నూర్పిడి దశలను బట్టి ఏ దశలో ఎంత ఎరువులు అవసరం అవుతాయో అంచనాలు వేసి అందుకు అనుగుణంగా నెలవారీ ప్రకారం ఎరువులు తెప్పించడానికి ప్రణాళిక తయారు చేశారు. కాగా ఇప్పటికే ఏప్రిల్ నెల కోటాతో పాటు బఫర్ స్టాక్ కింద జిల్లా వ్యాప్తంగా 30 వేల మెట్రిక్ టన్నుల వరకు అన్ని రకాల ఎరువులు నిల్వ ఉన్నట్లు డీఏఓ తెలిపారు.

చాగల్లుకు పోటెత్తిన వరద

- ప్రప్రథమంగా మేలోనే నిండిన ప్రాజెక్టు
- నీటిని దిగువకు వదులుతున్న అధికారులు



నీటితో నిండుగా ఉన్న చాగల్లు ప్రాజెక్టు

అనంతపురం సెంట్రల్: పెన్నానదిపై నిర్మించిన చాగల్లు ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. ప్రప్రథమంగా మేలోనే ప్రాజెక్టు నిండటం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా రెండురోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. పెద్దపప్పూరు మండల పరిధిలో చాగల్లు రిజర్వాయర్ నదీ పరివాహక ప్రాంతాలైన గుత్తి, పామిడి, పెద్దవడుగూరులో భారీ వర్షం కురవడంతో కనీవినీ ఎరుగని రీతిలో వరద వచ్చి చేరుతోంది. 1845 క్యూసెక్కుల చొప్పున ఇన్‌ఫ్లో నమోదవుతుండడంతో జలాశయం గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు వదులుతున్నారు. రిజర్వాయర్‌లో ఎక్కువ నీటిని నిల్వ చేస్తే ఉల్లికల్లు నీట మునిగే ప్రమాదముండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసే పరిస్థితి లేదు. వర్షపు నీటిని నేరుగా దిగువకు వదులుతున్నారు. సోమవారం 4 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. రాత్రి సమయాల్లో భారీ వర్షం కురిసే అవకాశముండడంతో రిజర్వాయర్‌లో నీటి మట్టం 0.97 టీఎంసీలకు తగ్గించారు. మరో రెండు మూడు రోజుల పాటు క్రస్ట్‌గేట్ల గుండా నీటిని దిగువకు విడుదల చేస్తామని హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు.

ఫేక్ పట్టా భూములు స్వాధీనం చేసుకోవాలి

- కలెక్టర్‌ను కోరిన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



కలెక్టర్ గౌతమితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు రూరల్: గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులు ఫేక్ పట్టాలతో అనంతపురం రూరల్ మండలంలో కబ్జా చేసిన విలువైన భూములన్నింటినీ స్వాధీనం చేసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. సోమవారం కలెక్టరేట్ 'స్పందన'లో కలెక్టర్ గౌతమిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంతపురం నగరం చుట్టూ వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు ఫేక్‌పట్టాలతో అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లాయన్నారు. ప్రత్యేకంగా మిల్ట్రీ పట్టాల పేరుతో ఫేక్ డాక్యుమెంట్లను సృష్టించి భూములు కబ్జా చేశారన్నారు. 2012లో ఆన్‌లైన్ విధానం రాగా.. అప్పుడు కనిపించని భూములు 2014 నుంచి 2018 మధ్య ఆన్‌లైన్‌లో ఎక్కించారని ఆరోపించారు. రెవెన్యూ రికార్డుల్లో ఖాళీగా ఉన్న చోట్ల పదేళ్ల కిందట పట్టాలిచ్చినట్లు రాసుకున్నారన్నారు. ఆ తర్వాత ఆన్‌లైన్ చేయడం.. ఆ వెంటనే అమ్ముకోవడం చేశారన్నారు. ఇలాంటి కేసులను 23 గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఫేక్ పట్టాలపై విజిలెన్స్‌తో విచారణ చేయించాలంటూ అసెంబ్లీలో కూడా మాట్లాడానని గుర్తు చేశారు. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ, పాపంపేట, కొడిమి, రాచానపల్లి, అక్కంపల్లి, కురుగుంట, ఆకుతోటపల్లి, సోములదొడ్డి, రాప్తాడు మండలం చిన్మయానగర్, ప్రసన్నాయపల్లి, రాప్తాడు ప్రాంతాల్లో వేలాదిమంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇదే విషయాన్ని ఇటీవల నార్పల పర్యటనకు వచ్చిన సీఎం దృష్టికి తీసుకెళ్లానన్నారు. రూ.25 కోట్లు మంజూరు చేయాలని కోరామన్నారు. అయితే అక్రమార్కుల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను వెనక్కు తీసుకుంటే పైసా ఖర్చు లేకుండా పేదలందరికీ ఇంటిపట్టాలు ఇవ్వొచ్చని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఫేక్ పట్టాలపై త్వరితగతిన విజిలెన్స్ అధికారులతో విచారణ చేయించి, అక్రమార్కుల చేతుల్లో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి ఏ స్థాయిలోనూ నిర్లక్ష్యానికి తావుండరాదని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్, ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడుతో కలిసి కలెక్టర్ వివిధ సమస్యలపై ప్రజల నుంచి 284 అర్జీలు స్వీకరించారు. అర్జీదారుతో నేరుగా మాట్లాడి సంతృప్తి చెందేలా సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. నిర్దేశిత గడువులోపు పరిష్కరించకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అర్జీల్లో కొన్ని..

- కారుణ్య నియామకం కింద తన కుమారునికి ఉద్యోగం ఇప్పించాలని అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు చెందిన సుదర్శనమ్మ విన్నవించింది. రాయదుర్గం ఆర్టీసీ డిపోలో బాడీ బిల్డర్‌గా విధులు నిర్వర్తించే తన భర్త చిన్నప్ప ఏడేళ్ల క్రితం చనిపోయాడని అందులో పేర్కొంది.
- తమ తండ్రి మరణ ధ్రువీకరణపత్రం మంజూరు చేయించేలా ఆదేశాలివ్వాలని పామిడిలోని బ్రాహ్మణవీధికి చెందిన సాదక్‌వలి విన్నవించాడు.
- సనప పొలం సర్వే నంబరు 186–1ఎలో తమకు 6.33 ఎకరాల వ్యవసాయ భూమి ఉంటే.. పాసు పుస్తకంలో 5.01 ఎకరాలు నమోదు చేసి మిగిలిన భూమిని వేరొక వ్యక్తి పేరున నమోదు చేశారని ఆత్మకూరుకు చెందిన నల్లప్ప ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరాడు.

24 మండలాల్లో వర్షం



గుత్తిలోని ఒక పొలంలో నిలిచిన వర్షపునీరు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో అకాల వర్షాలు పడుతూనే ఉన్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 24 మండలాల్లో వర్షం కురిసింది. 19.2 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పామిడిలో 50.8 మి.మీ, గుత్తి 47.6, యల్లనూరు 46.4, యాడికి 45.6, గుంతకల్లు 44.6, విడపనకల్లు 40.8, పెద్దవడుగూరు 39.4, వజ్రకరూరు 36.8, బొమ్మనహాళ్ 30.8, తాడిపత్రి 30.4, పుట్లూరు 30.2, కూడేరు 22, గార్లదిన్నె 20.6, నార్పల 19.4, ఉరవకొండ 17.4, డి.హీరేహాళ్ 15.6, శింగనమల 14, రాప్తాడు 11.8 మి.మీ మేర వర్షపాతం నమోదు కాగా.. మిగతా మండలాల్లో తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి.

రూ.3.50 కోట్ల పంట నష్టం : ఉరుములు, మెరుపుల వర్షానికి ఈదురుగాలులు తోడు కావడంతో రూ.3.50 కోట్ల పంట నష్టం వాటిల్లింది. ఈ మేరకు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

మరో రెండు రోజులు వర్షాలు : రాగల రెండు రోజులు జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవ రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.అశోక్‌కుమార్ సోమవారం విడుదల చేసిన వాతావరణ బులెటిన్‌లో తెలిపారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడా నమోదు కావచ్చని వెల్లడించారు.

శ్రామికుల అభ్యున్నతికి పెద్దపీట



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మేడే వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా, పార్టీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్ పీరా, తదితరులు

అనంతపురం క్రైం: రాష్ట్ర ప్రభుత్వం శ్రామికుల అభ్యున్నతికి పెద్ద పీట వేసిందని వక్తలు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం మేడేని ఘనంగా నిర్వహించారు. పార్టీ అనుబంధ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్ పీరా పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. అనంతరం వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ శ్రామికుల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దేశం పురోగతి సాధించిందంటే అందుకు శ్రామిక శక్తే కారణమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'నవరత్నాలు' పథకాలతో టైలర్లు, నాయీబ్రాహ్మణులు, రజకులు, ఆటో డ్రైవర్లను ఆదుకున్నారన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించారని గుర్తు చేశారు. కొర్రపాడు హుస్సేన్ పీరా మే డే ప్రాముఖ్యతను వివరించారు. ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, యానిమేటర్లు, హోంగార్డులు, పారిశుధ్య కార్మికులకు ఊహించని విధంగా వేతనాలు పెంచారన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్‌పర్సన్‌లు నదీం అహ్మద్, మీసాల రంగన్న, మాల్యవంతం మంజుల, కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎర్రిస్వామిరెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, జేసీఎస్ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, చింతకుంట మధు, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, శ్రీనివాసులు, సైఫుల్లాబేగ్, నాయకులు చింతా సోమశేఖర్‌రెడ్డి, గౌస్‌బేగ్, అనిల్‌కుమార్‌గౌడ్, పెన్నోబులేసు, శ్రీనివాసులు, కృష్ణవేణి, రాధాయాదవ్, శోభారాణి, దేవి, పార్వతి, శోభాబాయి పాల్గొన్నారు.

నేటి నుంచి పెన్నహోబిలం బ్రహ్మోత్సవాలు



లక్ష్మీనరసింహస్వామి మూల విరాట్

- 10న లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో మంగళవారం నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 13 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. నేడు ఆమిద్యాలలోని ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవ మూర్తులను మేళతాళాల నడుమ పెన్నహోబిలానికి తీసుకొస్తారు. మూడో తేదీన ధ్వజారోహణం, ప్రాకారోత్సవంతో పాటు నాలుగో తేదీన సింహవాహనం, చంద్రప్రభ వాహనం, ఐదో తేదీన గోవాహనం, శేషవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. ఆరో తేదీన హంసవాహనం, ఏడో తేదీన హనమంత వాహనంపై శ్రీవారి దర్శనం, ఎనిమిదో తేదీన గరుడ వాహనోత్సవం అనంతరం స్వామి కల్యాణోత్సవం, తొమ్మిదో తేదీన సూర్యప్రభ వాహనం, ఐరావత వాహనం, 10న స్వామి బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నారు. 11న అశ్వవాహనం, 12న వసంతోత్సవం, శయనోత్సవం, 13న ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా ఆమిద్యాలలోని ఆలయానికి చేర్చడంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. మహారథం మరమ్మతుల సమయంలో కుప్పకూలినందున.. దాని స్థానంలో ఆగమ శాస్త్రం ప్రకారం తాత్కాలిక రథం తెప్పించి రథోత్సవం నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

పండుగలా పింఛన్ పంపిణీ



అనంతపురం 50వ డివిజన్‌లో వృద్ధురాలు సునందమ్మకు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ కిషోర్, వలంటీర్ నవీన్

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా సోమవారం పింఛన్ పంపిణీ పండుగలా సాగింది. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సొమ్ము అందజేశారు. వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, పలు రకాల చేతి వృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం పింఛన్లు అందిస్తోంది. పంపిణీలో ఏ సమస్యలు ఉన్నా అప్పటికప్పుడు పరిష్కరించేందుకు డీఆర్‌డీఏ పీడీ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. మే నెలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,74,986 మంది లబ్ధిదారులు ఉండగా, తొలి రోజే 2,42,468 మందికి పింఛన్ సొమ్ము అందజేశారు. జిల్లా మొత్తం మీద 88.17 శాతం నమోదైంది. మిగిలిన వారికి మంగళవారం నుంచి అందజేసి.. వంద శాతం పూర్తి చేశామని అధికారులు తెలిపారు.

పింఛన్లు పంపిణీ చేసిన నవ వరుడు



పింఛన్ సొమ్ము అందజేస్తున్న సాదిక్‌వలి

ఉరవకొండ: నవ వరుడైన వలంటీర్ అంకితభావంతో పింఛన్ బట్వాడా చేసి ప్రశంసలు అందుకున్నాడు. ఉరవకొండ సచివాలయం–2 పరిధిలో డి.సాదిక్‌వలి వలంటీర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి బళ్లారికి చెందిన యువతితో వివాహం నిశ్చయమైంది. సోమవారం ఉదయం తన ఇంటి వద్ద నిఖాకు ఏర్పాట్లు చేశారు. అయితే సాదిక్‌వలి తెల్లవారుజామునే తన పరిధిలోని పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి సొమ్ము అందజేసి వచ్చాడు. తర్వాత నిఖా చేసుకున్నాడు.

టమాట కిలో రూ.7

అనంతపురం అగ్రికల్చర్ : కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.7 పలికింది. మార్కెట్‌కు 15 టన్నులు అమ్మకానికి రాగా.. కనిష్ట ధర రూ.3, సరాసరి రూ.4 మేర పలికింది.

క్లుప్తంగా

రెగ్యులర్ ఉద్యోగులుగా 232 మంది

అనంతపురం క్రైం: కార్మిక దినోత్సవం సాక్షిగా సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు పంపింది. రాయలసీమ రీజియన్ పరిధిలోని ఉమ్మడి అనంతపురం, కర్నూలు, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లోని వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న 232 మందికి ప్రొబేషన్ డిక్లేర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మునిసిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి సోమవారం తెలిపారు. అనంతపురంలో 45 మందిని రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణించగా.. ఇందులో 14 మంది వార్డు అడ్మినిస్ట్రేటివ్, ఏడుగురు ఎడ్యుకేషన్, 20 మంది శానిటరీ, నలుగురు వెల్ఫేర్ కార్యదర్శులు, కర్నూలులో 36 మందికి గాను 20 మంది అడ్మిన్, ఇద్దరు ఎడ్యుకేషన్, ఐదుగురు శానిటరీ, 9 మంది వెల్ఫేర్, కడపలో 56 మందికి గాను 9 మంది అడ్మిన్, 8 మంది ఎడ్యుకేషన్, 15 మంది శానిటేషన్, 24 మంది వెల్ఫేర్, చిత్తూరులో 95 మందికి గాను 26 మంది అడ్మిన్, 12 మంది ఎడ్యుకేషన్, 39 మంది శానిటరీ, 18 మంది వెల్ఫేర్ కార్యదర్శులు ఉన్నారు.

రగ్బీలో జిల్లా బాలికల జట్టుకు బంగారు పతకం

హిందూపురం టౌన్: కర్నూలులోని ఆదర్శ విద్యాలయ వేదికగా ఏప్రిల్ 30 నుంచి రెండ్రోజుల పాటు జరిగిన జూనియర్ బాల, బాలికల రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి అనంత జిల్లా బాలికల జట్టు బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్‌లో ప్రకాశం జిల్లా జట్టుతో పోటీ పడిన ఉమ్మడి అనంత బాలికల జట్టు 5–0 పాయింట్ల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది. ఉమ్మడి జిల్లా బాలుర జట్టు క్వార్టర్ ఫైనల్స్‌లో ఓటమి పాలైంది. సోమవారం సాయంత్రం విజేతలను అభినందిస్తూ ట్రోఫీతో పాటు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

గుడ్లురిమి.. ఆగడాలు 'జేసీ'

- నానాటికీ పెరుగుతున్న జేసీ ప్రభాకరరెడ్డి దౌర్జన్యాలు
- మున్సిపల్ అధికారులను గుప్పిట్లో పెట్టుకునే కుటిలయత్నం
- పని చేయలేక దీర్ఘకాలిక సెలవుపై కమిషనర్
- ఇలాగైతే పనిచేయలేమంటున్న మున్సిపల్ సిబ్బంది



తాడిపత్రి మున్సిపల్ కార్యాలయం

తాడిపత్రి అర్బన్: స్థానిక మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి ఆగడాలు రోజురోజుకూ శ్రుతిమించి పోతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ప్రాభవం కోల్పోవడంతో ఏదో ఒక రూపంలో వివాదాలు సృష్టిస్తూ అందరి దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు తెరలేపారు. గుడ్లురుముతూ.. బ్లాక్‌మెయిల్ చేస్తూ అధికారులను గుప్పిట్లో పెట్టుకునే కుటిల యత్నాలు ముమ్మరం చేశారు. మున్సిపాలిటీలో వ్యవహారాలన్నీ తన కనుసన్నల్లోనే జరగాలని, అధికారులందరూ తాను చెప్పినట్లు నడుచుకోవాలని, లేకపోతే అంతు చూస్తానని మున్సిపల్ సిబ్బందిని ఇంటికి పిలిపించుకుని బెదిరించడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.

బతుకంతా దౌర్జన్యాలు, దోపిడీలే

అధికారంలో ఉన్నా.. లేకున్నా.. జేసీ సోదరుల బతుకంతా దౌర్జన్యాలు, దోపిడీలేనని తాడిపత్రి వాసులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తూ తమ చీకటి రాజ్యాన్ని విస్తరించినట్లు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకూ వీరి ఆగడాలు భరించలేక ఎంతో మంది అధికారులు సెలవుపై వెళ్లగా... తాజాగా మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా సైతం అదే దారిన పయనించారు. పట్టణాభివృద్ధికి సహకరించక పోవడంతో పాటు మున్సిపల్ పాలనా వ్యవహారాల్లో చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి జోక్యం చేసుకుని వేధింపులకు తెరలేపడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీంతో సిబ్బంది మొత్తం మూకుమ్మడిగా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

గెలుపుపై ఆశలు సన్నగిల్లి

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన పట్ల ప్రజాదరణ పెరిగింది. ఈ క్రమంలో రాబోవు ఎన్నికల్లో ఆ పార్టీ అన్ని నియోజకవర్గాల్లోనూ విజయ కేతనం ఎగురవేస్తుందని జాతీయ స్థాయి సర్వే సంస్థల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు తాడిపత్రి ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎక్కడేగాని అల్లర్లు లేకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసులకు, ఇతర అధికారులకు సంపూర్ణ స్వేచ్ఛను ఇస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఓటమి భయం వెన్నాడుతుండడంతో జేసీ ప్రభాకరరెడ్డి కుతంత్రాలకు తెరలేపారు. ప్రధానంగా నియోజకవర్గ కేంద్రంలో అలజడులు సృష్టించి భయానక వాతావరణాన్ని నెలకొల్పేందుకు పావులు కదుపుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

> **ఆదరణను ఓర్వలేకపోతున్నారు**
>
> 
>
> ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి వస్తున్న ఆదరణను చూసి జేసీ ప్రభాకరరెడ్డి ఓర్వలేకపోతున్నాడు. వారి పాలనంతా దౌర్జన్యాలు, దోపిడీలతోనే సాగింది. చివరకు గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా మార్పు రావడం లేదు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలని కుట్రలకు ఇప్పటి నుంచే తెరలేపాడు. అధికారులెవరూ భయపడొద్దు. రాజీ పడకుండా విధులు నిర్వర్తించండి. నేను అండగా ఉంటా. ప్రజల ఆశీర్వాదంతో జేసీ కుట్రలన్నీ తిప్పికొడతాం.
>
> – కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్యే, తాడిపత్రి

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుత్తి: గుత్తి రైల్వే స్టేషన్‌లో ఆదివారం అర్ధరాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ప్లాట్ ఫారం–1పై కూర్చొన్న చోటే ఉన్నఫళంగా కుప్పకూలి ప్రాణాల కోల్పోయాడు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. వ్యక్తి మృతదేహాన్ని జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

రెండిళ్లలో చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

పరిగి: వేర్వేరు గ్రామాల్లో ఒకే రోజు రెండిళ్లలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... పరిగి మండలం శ్రీరంగరాజుపల్లిలోని బీసీ కాలనీలో నివాసముంటున్న ముక్కర్ల కృష్ణారెడ్డి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఉక్కపోతను భరించలేక ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి మిద్దెపైకి చేరుకుని నిద్రపోయారు. అర్ధరాత్రి రెండున్నర గంటలకు వర్షం మొదలవడంతో కిందకు దిగి వచ్చారు. అప్పటికే ఇంటి తలుపులు బద్ధలుగొట్టబడి ఉన్నాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువాలను ధ్వంసం చేసి 10 గ్రాముల బంగారు ఉంగరంతో పాటూ రూ.16,500 నగదు, హాల్‌లో ఉన్న ఓ సెల్‌ఫోన్‌ను దుండగులు అపహరించుకెళ్లినట్లు గుర్తించారు.అలాగే మోగా గ్రామంలోని సాయిబాబా ఆలయం వద్ద నివాసముంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు అంజినప్ప ఇంట్లో ఆదివారం రాత్రి దుండగులు చొరబడి, బీరువాలోని 7 తులాల బంగారంతో పాటు రూ.20 వేలను అపహరించుకెళ్లారు. ఈ రెండు ఘటనలపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నామినేషన్ల కోలాహలం

అనంతపురం సిటీ: అనంతపురం డివిజన్ తపాలా ఉద్యోగుల కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ సోమవారం కోలాహలంగా సాగింది. గతంలో కనీవిని ఎరుగని రీతిలో ఈసారి ఈ ఎన్నికలను సొసైటీ సభ్యులు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. తపాలా శాఖలోని మూడు యూనియన్లకు చెందిన వారు పోటీ పడుతుండడంతో ఎన్నికలు రసవత్తరంగా మారాయి.

బోణీ అదిరింది : కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. తొలి రోజే 30 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి తొమ్మిది డైరెక్టర్ స్థానాలకు 24 మంది నామినేషన్లు వేశారు. ఎక్స్‌ట్రా డిపార్ట్‌మెంట్ (జీడీఎస్ ఉద్యోగులు)కు సంబంధించి రెండు డైరెక్టర్ స్థానాలకు ఆరుగురు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి ఎస్.కుమార్ తెలిపారు. రెండు ప్యానెళ్లకు సంబంధించి 11 మంది డైరెక్టర్లను సభ్యులు ఎన్నుకోవాల్సి ఉంది. ఎన్నికైన డైరెక్టర్లు తిరిగి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శిని ఎన్నుకుంటారు.

తపాలా ఉద్యోగుల హంగామా

నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో తపాలా ఉద్యోగులు హంగామా చేశారు. తమ తమ మద్దతుదారులతో ర్యాలీగా వచ్చి నామినేషన్లు సమర్పించారు. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదని కొందరు ఉద్యోగులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఐదేళ్ల విరామం తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడం, ఈసారి మూడు యూనియన్లకు చెందిన వారు బరిలో దిగడం విశేషం. ఈ క్రమంలో ఎలాగైనా గెలుపొందాలన్న పట్టుదల మూడు యూనియన్ల నేతల్లోనూ స్పష్టమవుతోంది. ప్రత్యర్థులపై ఆరోపణలు, విమర్శలు చేస్తూ ఎన్నికల ప్రచారంలో ఎవరికి వారు ముందంజలో నిలిచారు.

నేటి నుంచి బీరప్పస్వామి పట్టపు దేవర

బొమ్మనహాళ్: స్థానిక జగద్గురు రేవణ్ణ సిద్దేశ్వర మహా ప్రాంగణంలో వెలసిన కురుబల ఆరాధ్య దైవం ఆగళూరప్ప (బీరప్ప) స్వామి పట్టపు దేవర మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రెండ్రోజుల పాటు సాగే ఈ ఉత్సవాలను దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత రాజగిరి గోత్రం మల్లెల వంశస్తులు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను సోమవారం వారు విడుదల చేశారు. ఉత్సవాలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానుండడంతో ఆ మేరకు ఏర్పాట్లను నిర్వాహక కమిటీ సభ్యులు పూర్తి చేశారు. మంగళవారం కలశపూజ, కాగడసేవ, గణపతి పూజతో బీరప్ప దేవుళ్ల శోభాయాత్ర ఉంటుంది. అనంతరం పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను కంబడిపై అధిష్ఠింపజేసి మహాశివపూజ నిర్వహించనున్నారు. బుధవారం పుణ్య దంపతులకు వస్త్ర సమర్పణ, సామూహిక వడిబాల కార్యక్రమాలు, గొరవయ్యల అమృతపానోత్సవం, బీరప్ప దేవుళ్ల సమేత ఆగలూరప్పస్వామి గ్రామోత్సవం, గొరవయ్యల నృత్యప్రదర్శన ఉంటాయి. ఉత్సవాలు ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రాంతీయ కులగురువు గోవిందవాడ మృత్యుంజయ ఒడయార్, జాలోడు కరియణ్ణ ఒడయార్, బళ్లారి శరణయ్య ఒడయార్, కర్తనపర్తి శాంతమూర్తి ఒడయార్, చాబాల మల్లికార్జున ఒడయార్ హాజరు కానున్నట్లు కమిటీ సభ్యులు ఈశ్వరప్ప, నాగరాజు, తిమ్మప్ప, ఎర్రిస్వామి, ఆగలూరి పేర్కొన్నారు.



ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న నిర్వాహక కమిటీ సభ్యులు

4 నుంచి బుద్ధ పౌర్ణమి వేడుకలు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయం వేదికగా ఈ నెల 4 నుంచి రెండ్రోజుల పాటు బుద్ధ పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నారు. ఏటా ప్రశాంతి నిలయంలో ఈ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం ఉదయం 8 గంటలకు సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి.

'పోలీసు స్పందన'కు 99 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 99 వినతులు అందాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ కె.శ్రీనివాసరావు స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్యలపై పదేపదే స్పందనకు వచ్చిన వారిని గుర్తించి సంబంధిత పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. సమస్యకు పరిష్కారం చూపలేనప్పుడు కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ వారం వచ్చిన ఫిర్యాదులను 14 రోజుల్లోపు పరిష్కారం చూపాలన్నారు.

దత్తతకు ఇద్దరు చిన్నారులు

అనంతపురం సెంట్రల్: మహిళాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న ఇద్దరు చిన్నారులను దత్తతకు ఇవ్వనున్నారు. ఈ మేరకు ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దైవిక్ (54 రోజులు), శ్రీరామ్ (రెండు సంవత్సరాలు)కు సంబంధించిన వారు ఎవరైనా ఉంటే 30 రోజుల్లోపు సంప్రదించాలి. లేకపోతే వారిని ప్రభుత్వ నిబంధనల మేరకు వేరొకరికి దత్తతకు ఇవ్వనున్నారు.

భక్తుల విరాళాలూ వదల్లేదు

- పెన్నహోబిలం అన్నదాన విరాళాల సేకరణలో గోల్‌మాల్
- దేవుడి పేరుతో దోచుకుంటున్నారంటున్న భక్తులు



అన్నదాన సత్రానికి డబ్బు చెల్లించినా రసీదు ఇవ్వలేదని ఆలయ ఈఓను నిలదీస్తున్న భక్తుడు (ఫైల్)

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో భక్తుల విరాళాలనూ కొందరు పెద్దలు వదల్లేదు. ఆలయానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన సత్రానికి అందిన విరాళాలను పక్కదారి పట్టించడం వివాదాస్పదమవుతోంది. ఇప్పటి వరకూ అన్నదాన సత్రానికి భక్తులు అందజేసిన విరాళాలకు సంబంధించిన లెక్కలు చూపకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయంగా కొందరు భక్తులు ఆలయ ఈఓ విజయ్‌కుమార్‌ని నిలదీయడంతో అసలు గోల్‌మాల్ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

రసీదులు చెల్లించకుండా మోసం

గత నెల 22న శ్రీవారి దర్శనానికి బళ్లారికి చెందిన కోర్టు ఉద్యోగి రాఘవేంద్ర కుటుంసభ్యులు వచ్చారు. ఆ సయయంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్‌ను కలసి అదే నెల 29న తమ కుటుంబసభ్యుల పేరుతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయాలని కోరుతూ రూ.15వేలు అందజేశారు. ఆ మొత్తాన్ని తీసుకున్న ఈఓ... కార్యాలయంలో సిబ్బంది ఎవరూ లేరని, రసీదు తర్వాత ఇస్తామని తెలపడంతో వారు వెళ్లిపోయారు. ఏప్రిల్ 29న రాఘవేంద్ర కుటుంబసభ్యులు మరోసారి ఆలయానికి వచ్చారు. దైవదర్శనం అనంతరం నేరుగా అన్నదాన సత్రానికి వెళ్లి.. ఈ రోజు అన్నదానం చేయిస్తున్నది తామేనని, ఎలాంటి వంటకాలు చేస్తున్నారని అక్కడి సిబ్బందితో ఆరా తీశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న అశోకవర్ధన్ (అనంతపురం, ప్రైవేట్ ఉపాధ్యాయుడు) అడ్డుకుని అన్నదానం చేయిస్తున్నది తానేనని, ఇందుకు రూ.15 వేలు ముందుగానే చెల్లించానని తేల్చిచెప్పాడు. దీంతో ఇద్దరూ వెంటనే ఈఓను కలసి ఆరా తీశారు. ఆ రోజు వండిన భోజనం కనీసం పది మందికి కూడా సరిపోదని, దేవుడి పేరు చెప్పి దోచుకుంటారా? అంటూ నిలదీశారు. విరాళాన్ని ఇచ్చిన వెంటనే రసీదులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఊహించని ఘటనతో ఈఓ విజయ్‌కుమార్‌కు పాలుపోలేదు. అన్నదానానికి సంబంధించి ప్రత్యేకంగా విరాళాల పుస్తకం లేదని, రథం తయారీకి సంబంధించిన రసీదు ఇస్తామని తెలపడంతో అలాంటివి తమకు వద్దంటూ విషయాన్ని వెంటనే ఫోన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

విరాళాల పుస్తకాన్ని దాచి...

పెన్నహోబిలానికి ప్రతి శనివారమూ పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వీరికి అన్నదానం చేయడాన్ని దైవకార్యంగా భావించిన ఎందరో దాతలు పెద్ద ఎత్తున విరాళాలను అందిస్తున్నారు. అన్నదాన సత్రానికి సంబంధించి అందుబాటులో ఉన్న విరాళాల పుస్తకాన్ని దాచి రసీదులు ఇవ్వకుండా భక్తులను అధికారులు మోసం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అంతేకాక వందలాది మంది భక్తులకు సరిపడేలా చేయాల్సిన వంటకాలను కేవలం పది మందికి మాత్రమే సరిపెడుతూ చేతులు దులుపుకుంటున్నారు. ఆ తర్వాత ఎవరొచ్చినా.. భోజనం లేదని వెనక్కు పంపుతున్నారు. వంటకాలను సైతం నాసిరకంగా చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని భక్తులు విమర్శిస్తున్నారు.

> **ప్రత్యేకంగా రసీదులు ఇవ్వం**
>
> పెన్నహోబిలంలో అన్నదాన సత్రానికి భక్తులు ఇచ్చే విరాళాలకు సంబంధించి ప్రత్యేకంగా ఎలాంటి రసీదులు ఇవ్వడం లేదు. ఇందులో ఎలాంటి అక్రమాలు జరగలేదు. గత నెల 22న రాఘవేంద్ర, అశోక్‌వర్ధన్ చెరో రూ.15వేలు అన్నదానం కోసం ఇచ్చిన మాట వాస్తవమే. వచ్చిన భక్తులకు పూర్తి స్థాయిలో అన్నదానం చేస్తున్నాం.
>
> – విజయ్‌కుమార్, ఈఓ, పెన్నహోబిలం

కేంద్రంలో కార్మిక వ్యతిరేక పాలన


వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు


మేడే సదస్సులో మాట్లాడుతున్న కార్మికశాఖ ఉప కమిషనర్ రఘురాములు



సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు

- వామపక్ష పార్టీల నాయకుల ధ్వజం
- జిల్లా వ్యాప్తంగా మేడే వేడుకలు

అనంతపురం అర్బన్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తోందని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐయూటీయూసీ రాష్ట్ర నాయకులు ధ్వజమెత్తారు. సోమవారం కార్మిక సంఘాలు జిల్లా వ్యాప్తంగా మేడే వేడుకలు ఘనంగా నిర్వహించాయి. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి కృష్ణ కళామందిర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి లలిత కళాపరిషత్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబిలేసు మాట్లాడారు. ఏఐయూటీయూసీ నాయకులు స్థానిక రషీద్ భవన్‌లో నిర్వహించిన మేడే సదస్సులో సంఘం రాష్ట్ర ఇన్‌చార్జ్ ఎల్.సుధీర్ మాట్లాడారు. ముర్తుజా, వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో సీఐటీయూ నాయకులు నాగేంద్రకుమార్, రాజమోహన్, గోపాల్, రాజేశ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సభలో ఏఐటీయూసీ నాయకులు రాజారెడ్డి, నారాయణస్వామి, పద్మావతి, మల్లికార్జున, శ్రీరాములు, లింగమయ్య, మల్లికార్జున, నాగవేణి, రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన ఏఐయూటీయూసీ సభలో పంచాయతీ పారిశుధ్య కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ అశోక్, జిల్లా నాయకులు కిశోర్, శేఖర్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అనంతపురం టౌన్: కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కార్మికశాఖ ఉప కమిషనర్ జి.రఘురాములు అన్నారు.స్థానిక పరిశ్రమల శాఖ సమావేశ మందిరంలో మేడే సందర్భంగా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధి హిత్యేన్ కుమార్ జైన్, కార్మిక సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, రామకృష్ణ, ఆంజనేయులు, రవికుమార్, సహాయ కార్మిక అధికారులు రాధా రమాదేవి, శివప్రసాద్, శివకుమార్, సుజాత, ప్రతాప్‌నాయుడు పాల్గొన్నారు.

అనంతపురం క్రైం: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన మే డే వేడుకల్లో ఆర్టీసీ, విద్యుత్, శ్రీ సత్యసాయి వాటర్ సప్లై ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు ఆర్వీ భాస్కర్‌రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, గోపాల్, మూర్తి, విద్యుత్‌శాఖ ఉద్యోగులు బషీర్ అహమ్మద్, రామాంజనేయులు, మారుతీప్రసాద్, శ్రీదేవి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి కేంద్రం తూట్లు

రాప్తాడురూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి చిరుతల మల్లికార్జున మండిపడ్డారు. అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి పంచాయతీ సదాశివన్ కాలనీలో సోమవారం మేడే జరుపుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ రాప్తాడు నియోజకవర్గ సహాయ కార్యదర్శి శ్రీకాంత్, రూరల్ మండల కార్యదర్శి రమేష్, మండల సహాయ కార్యదర్శి నరేష్, నాయకులు ధనుంజయ, రాము, అక్కులన్న, వెంకటనారాయణ, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: మండల కేంద్రంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎం.చలపతి, నాయకులు పెద్దిరాజు, బాషా, చౌడప్ప, పెదయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా సోమవారం కార్మికులు మేడే నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్, వామపక్ష నాయకులు రామకృష్ణ, రామయ్య, రాము, సరస్వతి, రాజేశ్వరమ్మ, వలి, విజయమ్మ, శివయ్య పాల్గొన్నారు.

నేడు 14వ డివిజన్‌లో గడప గడపకూ...

అనంతపురం క్రైం: నగరంలోని 14వ డివిజన్‌లో మంగళవారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఐరన్ బ్రిడ్జ్ సూర్యనగర్ సర్కిల్ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పార్టీశ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఉచిత న్యాయ సహాయంపై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి గరికపాటి దీనబాబు

అనంతపురం: మే డే సందర్భాన్ని పురస్కరించుకొని ఏపీఎస్‌ఆర్టీసీ బస్టాండ్ సముదాయంలో ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. కార్మిక చట్టాలు, కనీస వేతనాలు చట్టం, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం, 1987 ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కల్పించడంతో పాటు పలు సంక్షేమ పథకాల కింద అవగాహన కల్పించారు. జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి గరికపాటిదీనబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్కమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు


చెరకు గెడలను జలధికి తీసుకెళ్తున్న భక్తులు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని దేవలతోటలో వెలసిన తిరుగడ అక్కమ్మ గార్ల పరుష సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం చెరకుగెడలు తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. చెరకు గెడలను జలధి పూజలకు తీసుకెళ్లారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ

అనంతపురం సిటీ: అనంతపురానికి చెందిన ఇద్దరు చిన్నారులు జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో మెరిశారు. గత నెల 27 నుంచి 29 వరకు మొహాలిలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి అంతర్ జిల్లాల 7, 9 బాలుర విభాగంలో జరిగిన పోటీల్లో అనంతపురానికి చెందిన ఆర్.సాయి కార్తీక్‌రెడ్డి బంగారు పతకం సాధించాడు. స్పీడ్ క్వాడ్, రింక్-2, రింక్-3 రోడ్ రేస్ పోటీల్లో మొత్తం మూడు బంగారు పతకాలు సాధించారు. రింక్-1 రేస్‌లో హంజ అనే అబ్బాయి వెండి పథకం సాధించాడు.

కళాకారులను ప్రోత్సహించాలి


నిర్వాహకులను సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్ తదితరులు

అనంతపురం కల్చరల్: అనంత వాసి మనియార్ దాదా సాహెబ్ ఆధ్వర్యంలో నిర్మించిన ప్రాణం ఖరీదు లఘుచిత్రం సోమవారం విడుదల చేశారు. స్థానిక విద్యుత్‌శక్తినగర్‌లో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర రెడ్డి, వాసంతి సాహిత్య, మానవత సంస్థ తరిమెల అమరనాథరెడ్డి, డాక్టర్ అబ్దుల్ రజాక్, డాక్టర్ పోగుల కుమారయ్య తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. సహ చట్టం సంరక్షణ కమిటీ సభ్యులు నబీ రసూల్, బాలన్న, విశ్వనాథరెడ్డి, మానవహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రాజేశ్వరి, ఫైట్ ఫర్ రైట్స్ అధ్యక్షుడు కేపీ రాజు, తరిమెల రాజు, ఐఎంఎం మహబూబ్ బాషా మాట్లాడారు. అనంతరం నిర్మాత దాదు, దర్శకుడు జీఎం మురళీకృష్ణ నటీ నటులను సత్కరించారు.

పింఛన్ పంపిణీ

ఆత్మకూరు: మండలంలోని పింఛన్‌దారులకు వలంటీర్లు ఉదయమే ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. సోమవారం 1వ తేదీ కావడంతో గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నేరుగా పింఛన్ అందించారు. మండల వ్యాప్తంగా రేషన్ కార్డు ఉన్న వారికి ప్రతి ఇంటికీ వెళ్లి ఉచితంగా కార్డుదారులకు బియ్యం అందించారు.

వైభవంగా వీర ఓబులమ్మ స్వామి జలధి


వీర ఓబులమ్మ స్వామికి జలధి పూజ చేస్తున్న దృశ్యం

రాప్తాడు: బుక్కచెర్ల గ్రామంలో సోమవారం వీర ఓబులమ్మ స్వామి జలధిపూజ నిర్వహించారు. గ్రామ సమీపంలోని పొలాల్లో ఉన్న అమ్మవారిని వ్యవసాయ బావి దగ్గరకు తీసుకొచ్చి వీఆర్వో పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో జలధి పూజ,అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వీరారెడ్డి, సర్పంచు ఆదినారాయణమ్మ, మాజీ సర్పంచు గంగలకుంట మధుసూదన్ రెడ్డి, అడ్వొకేట్ రాజశేఖర్, స్వామి కాపులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

డీఏ మంజూరుపై హర్షం

రాప్తాడురూరల్: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేయడంపై ఎన్‌జీఓ అసోసియేషన్ అనంతపురం నగర అధ్యక్షుడు ఎం.మనోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉద్యోగ, పెన్షనర్ల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ఆత్మకూరు: సింగంపల్లి వద్ద అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతుండగా ఏడుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.52,830 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ రవిప్రసాద్ సోమవారం తెలిపారు.

డెయిరీ ట్రయల్ రన్ విజయవంతం

- పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా


పూజ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి మనోరమ చిత్రంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, పైలా నరసింహయ్య

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్న లేఅవుట్ పక్కన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తన సొంత నిధులు రూ. 15 కోట్లతో ఏర్పాటు చేసిన 'తోపుదుర్తి మహిళా సహకార డెయిరీ' ప్రారంభానికి సిద్ధమైంది. సోమవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఆయన సతీమణి మనోరమ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాంకేతిక నిపుణుల పర్యేక్షణలో ఈ ట్రయల్ రన్ జరిగింది. డెయిరీ కోసం విదేశాల నుంచి అధునాతన సాంకేతిక పరికరాలు తెప్పించారు. రోజూ లక్ష నుంచి 1.20 లక్షల లీటర్ల పాలసేకరణే లక్ష్యంగా పెట్టుకున్నారు. డెయిరీ ఏర్పాటుతో తొలి విడతలో రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా 10 వేల మంది మహిళా పాడి రైతులకు లబ్ధి చేకూరనుందని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఏడాది కాలంలోనే మరో 20 వేలమందికి లబ్ధి కలగనుందన్నారు. మొత్తం 30 వేల మంది మహిళా రైతులకు మేలు జరుగుతుందన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా డెయిరీని ప్రారంభించి, మహిళా పాడి రైతులకు అంకితం చేస్తామన్నారు. ట్రయల్‌రన్ కార్యక్రమంలో అనంతపురం జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ఏడీసీసీ బ్యాంకు డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి, రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ తాటిచెర్ల నాగేశ్వరరెడ్డి, మండల కన్వీనర్లు బండి పవన్, దుగుమర్రి గోవిందరెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుసేన్‌పీరా, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నాయకులు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల లబ్ధి

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి


కక్కలపల్లికాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ రూ.లక్షల లబ్ధి చేకూరిందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ సచివాలయం-3 పరిధిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం సోమవారం సాయంత్రం నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లారు. ప్రతి గడపలోనూ ఎమ్మెల్యేను మహిళలు ఆప్యాయంగా పలకరించారు. ఇళ్ల వద్దకు వెళ్లగానే మూడేళ్లలో ఆ కుటుంబం ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు.

ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరింపు..

ఏమ్మా తల్లీ.. డ్వాక్రా డబ్బులు పడుతున్నాయి కదా?, అమ్మఒడి డబ్బులు పడుతున్నాయా? సొంతిల్లు మంజూరైందా? ఇంటి స్థలం మంజూరైందా? అని ప్రతి ఇంటి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. 'నేను విన్నాను...నేను ఉన్నాను' అంటూ ఆ రోజు జగనన్న చెప్పిన విధంగానే ముఖ్యమంత్రి అయిన తర్వాత అన్ని వర్గాలకూ అండగా నిలిచారని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తాటిచెర్ల నాగేశ్వరరెడ్డి, సర్పంచ్ తేజశ్విణి, ఎంపీటీసీ సభ్యులు గాయత్రిదేవి, వడ్డే శీనా, నాయకులు ధనుంజయయాదవ్, యూత్ మండల కన్వీనర్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ బండి పవన్, జేసీఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, స్థానిక నాయకులు వలి, రామస్వామి, రెడ్డప్ప, బాషా, అన్ను, జాఫర్, సలీం పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం

రాప్తాడు: ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గొందిరెడ్డిపల్లిలో గాలివానకు దెబ్బతిన్న అరటి తోటలను ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. ఎమ్మెల్యే పంట దెబ్బతిన్న రైతు నాగిరెడ్డి పొలానికి వెళ్లి పరిశీలించారు. తక్షణ సాయం కింద ఎకరానికి రూ.10 వేల ప్రకారం 7 ఎకరాలకు ఎమ్మెల్యే సొంతంగా అందించారు. కార్యక్రమంలో హెచ్ఓ రత్నకుమార్, ఏఓ శుభకర్, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల జూటూరు శేఖర్, యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, ఎస్సీ సెల్ కన్వీనర్ నారాయణస్వామి పాల్గొన్నారు.

మాధవరాజులస్వామికి ప్రత్యేక పూజలు

కనగానపల్లి: బద్దలాపురం గ్రామంలో జరుగుతున్న మాధవరాజులు స్వామి పరుషలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోమవారం పాల్గొన్నారు. స్థానిక గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరాజులు స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దీంతో పాటు స్థానిక వాల్మీకి, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైభవంగా వీరనాగమ్మ ఉత్సవాలు


వేడుకల్లో పాల్గొన్న ఎంపీ గోరంట్ల మాధవ్

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి సమీపంలో వెలిసిన పాలవేరు వీరనాగమ్మ ఉత్సవాలు సోమవారంతో వైభవంగా ముగిశాయి. చివరిరోజు అగ్నిగుండ ప్రవేశం ప్రత్యేకంగా నిలిచింది. ఆలయాభివృద్ధి కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు చివరిరోజు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్ తదితరులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం పెద్ద ఎత్తున చేశారు. ఈసందర్భంగా రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రి శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ భాస్కర్, స్థానిక నాయకులు ఆనందప్ప, అంజి, వెంకటేశు, నరసింహులు, కృష్ణా, కొండారెడ్డి, కృష్ణంరాజు పాల్గొన్నారు.

రిచ్ వెబ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌లో ప్రతిభ


విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన నల్ల నరసింహారెడ్డి సొసైటీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ వారు ఇటీవల నిర్వహించిన రిచ్ వెబ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ జాతీయస్థాయి హ్యాకథాన్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ డేటా సైన్స్ విద్యార్థులు గ్రీష్మ, చిన్మయి, గౌస్‌పీర్, లోక్‌సాయి, లాస్య, మజూర్ జాతీయ స్థాయిలో 3వ బహుమతి సాధించారన్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, టీపీఓ రంజిత్‌రెడ్డి, హెచ్ఓడీ డాక్టర్ చిత్రలింగప్ప అభినందించారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలి


37వ డివిజన్‌లో పర్యటించిన మేయర్ వసీం

అనంతపురం క్రైం: వర్షాలతో అస్తవ్యస్తంగా మారిన ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మేయర్ వసీం ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డిని ఆదేశించారు. సోమవారం 37వ డివిజన్‌లో మేయర్ పర్యటించారు. వర్షాలతో కాలువలు నిండి రోడ్డుపైకి వచ్చిన మురుగును త్వరితగతిన తీయాలన్నారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. మేయర్ వెంట కార్పొరేటర్ అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు ఖాజా తదితరులున్నారు.

6న మోడల్ ఎంసెట్

గుంతకల్లు: పట్టణంలోని శస్త్ర కళాశాలలో ఈనెల 6వ తేదీన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే ఎంసెట్ (ఆన్‌లైన్) పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వాణి కోరారు. సోమవారం కళాశాలలో మోడల్ ఎంసెట్‌కు సంబంధించిన కరప్రతాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంసెట్ పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు కాబట్టి కంప్యూటర్ మీద అవగాహన ఉండాలని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 846608847, 6281963077 నంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సీ.రమేష్, కళాశాల కరస్పాండెంట్లు చంద్రశేఖర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

4న గొల్లకొండ వెంకటరమణ స్వామి కల్యాణం

శింగనమల: మండల కేంద్రంలో ఈనెల 4వ తేదీన గొల్లకొండ వెంకటరమణ స్వామి కల్యాణం జరగనుంది. ఈనెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం స్వామిని పల్లకీలో ఊరేగించారు. 2వ తేదీ రాత్రి స్వామిని హనుమద్ వాహనంపై ఊరేగించనున్నారు. 3వ తేదీ రాత్రి గరుడసేవ, 4వ తేదీ రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకూ రామాలయంలోని తలంబ్రాల మండపంలో వెంకటరమణ స్వామి, భూదేవి, శ్రీదేవి సహిత కల్యాణం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి హాజరుకానున్నారు. 5వ తేదీ మధ్యాహ్నం సుంకర రమణ ఆధ్వర్యంలో అన్నదానం, అనంతరం 3 గంటల నుంచి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు.

రేపు భూముల వేలం

తాడిపత్రి: చిన్నపొడమల గ్రామంలో ఉన్న చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి దేవస్థానాలకు చెందిన భూములను కౌలుకు ఇచ్చేందుకు ఈనెల 3న మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని దేవస్థానం వద్ద దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వేలం జరుగుతుందన్నారు. చెన్నకేశవస్వామి దేవస్థానమునకు సంభందించి సర్వే నంబర్లు 189, 204, 449, 486-2, 494-1, 573, ఆంజనేయ స్వామి దేవస్థానమునకు సంభందించి సర్వే నంబర్ 247లోని భూములను కౌలుకు ఇస్తామని వెల్లడించారు. మరిన్ని వివరాలకు కార్యనిర్వహణాధికారి, సమూహ దేవస్థానాల్లో సంప్రదించాలని తెలిపారు.

88.85 శాతం పింఛన్ పంపిణీ

అనంతపురం క్రైం: నగరంలోని వివిధ డివిజన్లలో సోమవారం పింఛన్ పంపిణీ జరిగింది. వేకువ జామున నుంచే సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు లబిబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. మొత్తం 22,631 పింఛన్లలో 20108 (88.85 శాతం) మందికి రూ.5,64,59,000 పంపిణీ చేశారు. 2,523 మందికి మాత్రమే పింఛన్ పంపిణీ చేయాల్సి ఉంది.

ఆసక్తికరంగా 'ఎర్రపద్యాలతో ఒక సాయంత్రం'


కవితాగానం చేస్తున్న జిరసం ప్రధానకార్యదర్శి కొత్తపల్లి సురేష్

అనంతపురం కల్చరల్: జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జరిగిన 'ఎర్రపద్యాలతో ఒక సాయంత్రం' కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. స్థానిక కల్యాణ దుర్గం రోడ్డులో ఎస్ఎఫ్ పాఠశాల ప్రాంగణంలో జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సీపీఐ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సత్యశోధక్ సమాజ్ వ్యవస్థాపకులు పోతుల రాధాకృష్ణ, తరిమెల అమరనాథరెడ్డి హాజరై మాట్లాడారు. సురేష్‌తో పాటు గోసల నారాయణస్వామి, నబీరసూల్, హరినాథరెడ్డి, వన్నప్ప, మిద్దె మురళీకృష్ణ, చేగువేరా హరి, మధురశ్రీ, రామలింగారెడ్డి, టీవీ రెడ్డి, అశోక్ తదితరులు గానం చేసిన కవితలు కార్మికుల దినోత్సవానికి దర్పణం పట్టాయి.

ముస్లింలకు 'తోపుదుర్తి' చేయూత


ముస్లింలకు రంజాన్ తోఫా అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (ఫైల్)

ఆత్మకూరు: నియోజకవర్గంలోని ముస్లింల సంక్షేమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేయూతనిస్తున్నారు. ముస్లింల అభివృద్ధి కోసం సొంత డబ్బు వెచ్చించారు. మసీదులు, శ్మశాన వాటికల ప్రహరీలను సొంత నిధులతో నిర్మించారు. గత రంజాన్ నెలలో నియోజకవర్గ వ్యాప్తంగా ఏడువేల మందికి రంజాన్ తోఫా అందించారు. ఇలా అన్ని రకాలుగా ముస్లింలకు ఎమ్మెల్యే అండగా నిలిచారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల ముస్లింకు ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో దాదాపు 7 వేల మందికి రంజాన్ తోఫా అందించారు. ముస్లింలకు సేమియాలు, బియ్యం, నెయ్యి, చక్కెర, గోధుమ పిండి, కందిబేడలు, ఆయిల్ ప్యాకెట్‌ను అందించారు. అనంతపురం రూరల్ మండలంలోని ఫాతిమా మసీదుకు రూ.5 లక్షలు, తారీ మసీదుకు రూ.6 లక్షలు , చెన్నేకొత్తపల్లి మండలంలోని మసీదుకు రూ.3 లక్షలు అందించారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. పలుచోట్ల ప్రహరీ నిర్మాణానికి ఇటుకలు, ఇసుక కూడా అందించారు. గత రంజాన్ నెలలో ఆరు మండలాల్లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రోజూ మసీదుల వద్ద ఖర్జూరం ప్యాకెట్లు పంపిణీ చేయించారు.

సేవ చేయడం నా అదృష్టం

అభివృద్ధి జరగాలనే ఆకాంక్షతో ప్రజలు నన్ను నమ్మి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నా. గతంలో నియోజకవర్గంలో ఎక్కడా జరగని అభివృద్ధి చేసి చూపిస్తున్నాం. ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తున్నాం. ముస్లింలకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నాం. మసీదుల అభివృద్ధికి సహకరిస్తున్నాం. ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధి చేసి చూపాం.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే

వేసవి సెలవుల్లో మినహాయింపు ఇవ్వాలి

రాప్తాడురూరల్: వేసవి సెలవుల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు వివిధ కార్యక్రమాల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేష్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నగరంలోని ఉపాధ్యాయ భవనంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, అసోసియేట్ కార్యదర్శి హనుమప్ప, గౌరవాధ్యక్షులు ప్రభాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.